క్లుప్తంగా

నేడు కేంద్రమంత్రి పర్యటన

కంచికచర్ల: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం ఉదయం 10గంటలకు వికసిత్ భారత సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.శిల్ప తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర కుటుంబ సంక్షేమం, ఆరోగ్యశాఖ సహాయమంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్‌పవార్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ హాజరవుతారని వివరించారు.

చిల్లకల్లులో..

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని షేర్ మహ్మద్‌పేటలో కేంద్ర కుటుంబ సంక్షేమం, ఆరోగ్య శాఖ సహాయమంత్రి భారతి ప్రవీణ్ పవార్ శనివారం పర్యటించనున్నట్లు ఎంపీడీవో రమేష్‌బాబు తెలిపారు. వికసిత భారత్ సంకల్పయాత్ర కేంద్రమంత్రి మధ్యాహ్నం రెండుగంటలకు తొర్రకుంటపాలెంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శిస్తారని, అనంతరం షేర్‌మహ్మద్‌పేటలో జరిగే సంకల్పయాత్రలో పాల్గొంటారని వివరించారు. అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగామ: తొర్రగుడిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఆయా గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రామకృష్ణ శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. రాఘవాపురం, కమ్మవారిపాలెం, గోళ్ళమూడి, రుద్రవరం, సోమవరం, కొండూరు, మాగల్లు, జొన్నలగడ్డ, రామిరెడ్డిపల్లి, తొర్రగుడిపాడు, కొణతమాత్మకూరు, దాములూరు గ్రామాలకు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఓటు నమోదుపై అవగాహన

పరిటాల(కంచికచర్ల) : పద్దెనిమిదేళ్లు నిండిన యువతీయువకులు ఓటుహక్కు కలిగి ఉండాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహనరావు సూచించారు. పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ ఓటుహక్కు వినియోగించుకోవడం బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిందని, ఓటు లేనివారు వెంటనే ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఎం.శ్రీదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాలకు వైర్‌లెస్ స్పీకర్ బహూకరణ

పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌కు శుక్రవారం ఉమ్మడి జిల్లాల ఓపెన్ స్కూల్ సమన్వయకర్త నక్కా బాబూరావు రూ.8వేల విలువైన వైర్‌లెస్ స్పీకర్‌ను హెచ్‌ఎం కె.జలజ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం బాబూరావును పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



పెండ్యాల(కంచికచర్ల) : మండలంలోని పెండ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీమెటీరియల్‌ను ఎంపీపీ మలక్‌బషీర్ శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తోందని వివరించారు. అనంతరం ఎంపీపీ మలక్‌బషీర్‌ను ఉపాధ్యాయులు, హెచ్‌ఎం సత్కరించారు. ఫయీంపాషా, మియాన్, కుర్షీద్ ఆలీ, అబ్దుల్ రహీమ్, అబ్దుల్‌కరీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గండేపల్లి(కంచికచర్ల) : మండలంలోని గండేపల్లి గ్రామానికి చెందిన పిల్లి అగ్నేసమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, ఆ కుటుంబానికి నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అందించిన రూ.5వేల ఆర్థికసాయాన్ని సొసైటీ అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరెడ్డి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పిల్లి భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ కార్యదర్శి తలమాల కిషోర్, పెండెం ప్రకాశరావు, చావల లక్ష్మమ్మ, పిల్లి దాసు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు



నందిగామలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు, నాయకులు

చెవిటికల్లు(కంచికచర్ల): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి చేసిన సంక్షేమం, అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓటెయ్యాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు కోరారు. మండలంలోని చెవిటికల్లులో శుక్రవారం ఆయన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి సాధకబాధకలతోపాటు ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రభుత్వ పథకాల అమలుతేదీలతో కూడిన క్యాలెండర్‌ను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓ చరిత్ర సృష్టించారన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ లబ్ధి చేకూరిందని వివరించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజాపాలనను ఇంటి ముంగిటికే తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, రైతుభరోసా, కాపునేస్తం, మత్స్యకార భరోసా, లానేస్తం, ఈబీసీ నేస్తం వంటి పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సీఎం జగనన్న చేసిన మేలును మునుపెన్నడూ మరెవ్వరూ చేయలేదని గ్రామస్తులు చెబుతుండటం సంతోషంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, సర్పంచి బుడ్డి విజయలక్ష్మి, వైఎస్ ఎంపీపీ వెలగలేటి మాధవి, సొసైటీ అధ్యక్షుడు మంగింశెట్టి పుల్లారావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు బుడ్డి సత్యనారాయణ, నాయకులు శింగంశెట్టి ప్రసాద్, సురేష్, తిరుమలశెట్టి ప్రసాద్, నాగులు, సత్యం, రహూఫ్, ముస్తాఫా వెలగలేటి వాసు, వెలగలేటి బాబు, మార్త శ్రీనివాసరావు, మంగలపూడి సన్నీ, కోటిబాబు, మోహనరావు, కార్యదర్శి మీర్జావలి, వీఆర్వో సునందారాణి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



చెవిటికల్లులో వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

అర్హతే ప్రామాణికంగా పథకాలు

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్‌ను రూ.3వేలకు పెంచి అవ్వాతాతలకు, దివ్యాంగులకు అండగా నిలిచారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కొనియాడారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో పెంచిన పింఛన్ కానుక రూ.3వేలను లబ్ధిదారులకు శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. నూతనంగా పింఛన్ మంజూరైన వారికి పింఛన్ నగదు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ చంద్రబాబు ఐదేళ్ల పాలనలో లంచాలు, జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలపై మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవని గుర్తుచేశారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో లంచాలు, సిఫార్సులకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న వైనాన్ని గమనించాలని కోరారు. నందిగామ మండలంలో ఇప్పటికే 4,795మందికి పింఛన్ ఇస్తుండగా, నూతనంగా మరో 48మందికి పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరిగెల సుందరమ్మ, వైస్ ఎంపీపీలు ఆకుల హనుమంతరావు, అన్నం పిచ్చయ్య, ఎంపీడీవో శ్రీనివాసరావు, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మండల కన్వీనర్ మంచాల చంద్రశేఖర్, నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, అయిలపోగు రమ, నాయుడు ఉదయలక్ష్మి పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

జుజ్జూరు(వీరులపాడు): ఆడుదాం ఆంధ్రా పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో కెనడీ సూచించారు. జుజ్జూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా నిర్వహించనున్న క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. క్రికెట్ పోటీల్లో ఆరుజట్టు పాల్గొంటున్నట్లు కోఆర్డినేటర్లు నారాయణ, రాజు తెలిపారు. క్రికెట్లో ఆయా జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ సత్యనారాయణ, టీచర్లు రామకృష్ణ, కృష్ణ, జోసెఫ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ క్యాంటీన్ ప్రారంభం

నందిగామ టౌన్: అంబేడ్కర్ క్యాంటీన్‌లో ఆత్మగౌరవంతో ప్రతిఒక్కరు భోజనం చేసేలా నిర్వాహకులు కృషి చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ సూచించారు. దళిత చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ క్యాంటీన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ క్యాంటీన్ అన్నివర్గాలకు చెందిన క్యాంటిన్ అనే భావన తీసుకురావాలన్నారు. క్యాంటిన్ నిర్వహణకు తనవంతుగా సహకారం అందిస్తానంటూ నిర్వాహకులు కన్నెగంటి సజ్జనరావు, పెసరమల్లి శేఖరరావు తదితరులను అభినందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో ఎస్సీలు, బీసీలంతా ఆత్మగౌరవంతో జీవనం సాగిస్తున్నారన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్న ఐదేళ్లలో 125 అడుగుల బీఆర్ అంబేడ్కర్ విగ్రహం పెడతానని మాటలతో కాలం వెళ్లదీశారు తప్ప ఒక్క ఇటుక కూడా వేయలేదన్నారు. కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం విజయవాడ నడిబొట్టున 225 అడుగుల ఎత్తులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ నెల 19న విజయవాడలో జరగనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు పెద్దఎత్తున తరలివెళ్లి మేమంతా అండగా ఉన్నామని చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా రాజకీయపార్టీలు, మేధావులు సంఘం నాయకులు గంటి విజయ్ కుమార్, పిల్లి జయరాజు, బండారు కేదార్‌నాథ్, మహ్మద్ మస్తాన్, షేక్ కరిముల్లా, చిరుమామిళ్ల చైతన్యకుమార్, పాకాలపాటి కిరణ్, దాసు, షేక్ యాకుబ్ అలీ, స్థానికులు పాల్గొన్నారు.



క్యాంటీన్ ప్రారంభించి భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

అమ్మవారిని దర్శించుకున్న కోదాడ ఎమ్మెల్యే

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారిని శుక్రవారం రాత్రి తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖామంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సతీమణి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు ఆమెను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వూట్ల నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కాకాని శ్రీనివాసరావు, తెలంగాణా కాంగ్రెస్ నాయకుడు చింత కుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.



ప్రజల ఆరోగ్య భద్రతే జగనన్న లక్ష్యం

పెండ్యాల(కంచికచర్ల) : మూరుమూల గ్రామాల్లో నివసించే పేద ప్రజలకు సైతం మెరుగైన వైద్యం అందించి వారికి ఆరోగ్యభద్రత కల్పించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, అందుకోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రూపకల్పన చేశారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని పెండ్యాలలో ఏర్పాటు చేసిన ఫేజ్–2 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజారోగ్యం విషయంలో మనరాష్ట్రం ముందంజలో ఉందన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం ద్వారా ప్రతిఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, ఎంపీటీసీ సభ్యుడు షేక్ బడేహజరత్, నాయకులు షేక్ నిస్సార్‌పాషా, చాన్‌బహదూర్, డాక్టర్ స్రవంతి, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.



పెండ్యాలలో మెడికల్ కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ప్రశాంతి, నాయకులు

విజ్ఞాన్‌లో క్రీడా సంబరాలు ప్రారంభం

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక విజ్ఞాన్ విద్యాసంస్థల్లో శుక్రవారం క్రీడాసంబరాలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి స్పోర్ట్స్ మీట్ 2023–24 లోగోను ఆవిష్కరించారు. క్రీడాజ్యోతిని వెలిగించి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో క్రీడాజ్యోతితో పట్టణంలో ర్యాలీ నిర్వహించి, క్రీడాజ్యోతిని ప్రాంగణానికి చేర్చారు. సుధారాణి మాట్లాడుతూ నేటి పోటీప్రపంచంలో రాణించాలంటే చదువుతోపాటు ఎన్‌సీసీ, క్రీడల్లో రాణించడం అదనపు అర్హతలుగా ఉంచుకోవాలని సూచించారు. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. ఎన్‌సీసీ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, పీఈటీ హరిశ్చంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న తన్నీరు సుధారాణి

లారీ దగ్ధం ఘటనతో ఉద్రిక్తత

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడు పంచాయతీ కార్యాలయం వద్ద నిలిపి ఉంచిన సర్పంచి బోశెట్టి జ్యోతిబ్రహ్మంకు చెందిన లారీకి శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియనివ్యక్తులు నిప్పంటించడంతో లారీ క్యాబిన్ పూర్తిగా కాలిపోగా, వరికోత యంత్రం పాక్షికంగా దెబ్బతింది. ఈ ఘటనకు బోశెట్టి త్రినాధ్ అనేవ్యక్తి కారణమని అనుమానిస్తూ పోలీసులు అతన్ని ఓ కారులో పోలీసుస్టేషన్‌కు తరలించేందుకు యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. కారు అద్దాలు పగులగొట్టి త్రినాథ్‌పై దాడిచేయడంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నందిగామ ఏసీపీ జనార్ధననాయుడు గ్రామాన్ని సందర్శించి పోలీసు సిబ్బందితో కలిసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రినాథ్, నరసింహారావు, నాగరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తోపాటు పలు కేసులు నమోదు చేసినట్లు జగ్గయ్యపేట సీఐ ఎం.జానకిరామ్ తెలిపారు. గతంలో గ్రామంలో చోటుచేసుకున్న పలు ఘటనల్లో నరసింహారావు, నాగరాజుపై కేసులు నమోదు కావడానికి సర్పంచి భర్త బ్రహ్మమే కారణమని వారిద్దరిని రెచ్చగొట్టి, వారితో కలిసి లారీని దగ్ధం చేశారని సర్పంచి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. లారీ దగ్ధం ఘటనలో తమకు రూ.12 లక్షల నష్టం జరిగిందని, తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు.



నిందితుడిని తరలిస్తున్న కారును అడ్డుకుంటున్న అనిగండ్లపాడు గ్రామస్తులు

పింఛన్ పెంపు లబ్ధిదారుల పాలిట వరం

జగ్గయ్యపేట అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పింఛన్‌ను రూ.3వేలకు పెంచడం రాష్ట్రంలోని 66.34లక్షల మంది వృద్ధులు, దివ్యాంగులు తదితర పింఛన్‌దారుల పాలిట వరమని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర కొనియాడారు. స్థానిక ఉక్కు కళావేదికలో నిర్వహించిన కార్యక్రమంలో పెంచిన పింఛన్ నగదు రూ.3వేలను శుక్రవారం రాత్రి పట్టణంలోని లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటివరకు 5,087 పింఛన్లు వస్తుండగా, నూతనంగా మరో 60కలిపి మొత్తం 5,147మందికి సుమారు రూ.1.38కోట్లను ఈనెల అందజేస్తున్నట్లు వివరించారు. కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగనన్న పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పట్టణ, పెనుగంచిప్రోలు సచివాలయాల కన్వీనర్లు తుమ్మేపల్లి నరేంద్ర, కన్నమాల శామ్యూల్, కౌన్సిలర్లు గింజుపల్లి వెంకట్రావు, వట్టెం మనోహర్, ఖాదర్‌బాబు, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి జుబేర్, దుర్గ గుడి డైరెక్టర్ నంబూరి రవి, నాయకులు కాశికిషోర్, జాన్‌బాషా, గెల్లా పూర్ణ, మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



పింఛన్ల నమూనా చెక్కు ఆవిష్కరిస్తున్న చైర్మన్ రాఘవేంద్ర, హఫీజున్నీసా, ప్రభాకర్ తదితరులు

ఆటో బోల్తా-ఆరుగురికి తీవ్ర గాయాలు

కంచికచర్ల : మిరపకాయల కోతకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆటో అదుపుతప్పి బోల్తాకొట్టడంతో ఆరుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. మరో 12మంది స్వల్పంగా గాయపడిన ఈ సంఘటన కంచికచర్ల సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వీరులపాడు మండలం పొన్నవరం గ్రామానికి చెందిన 18మంది మహిళలు ఓ ఆటోలో కీసరలో మిర్చికోతకు వెళ్లి, తిరిగి సాయంత్రం ఆటోలో ఇంటికి వెళ్తుండగా పేరకలపాడు క్రాస్ రోడ్డు వద్దకు రాగానే ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన మీసాల పద్మ, చాట్ల భాగ్యశ్రీ, చాట్ల ఆగ్నేస్, మీసాల త్రివేణి, చాట్ల నాగరాణి, ప్రియాంక తీవ్రంగా గాయపడగా, మరో 12మందికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న నేషనల్ హైవే అంబులెన్స్ వాహన సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను చికిత్స కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మీసాల పద్మ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

195 మందికి వైద్యపరీక్షలు

వత్సవాయి(పెనుగంచిప్రోలు): మండలంలోని దబ్బాకుపల్లిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ హస్నా, సుష్మాప్రియదర్శిని పాల్గొని 195మంది గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి, మందుల కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ నగేష్, సొసైటీ అధ్యక్షులు పండగ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షులు సైదుబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.